క్లుప్తంగా

మహిళలు స్వయం ఉపాధి సాధించాలి

కొత్తగూడెంరూరల్: మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు అన్నారు. లక్ష్మీదేవిపల్లిలోని భవన నిర్మాణ కార్మిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు నాగా సీతారాములు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. మాట్లాడుతూ.. మహిళలు ఎంచుకున్న రంగంలో నైపుణ్యాన్ని సాంధించి ఆయా రంగాల్లో నిలదొక్కుకోవాలన్నారు. తన సొంత ఖర్చులతో మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు.

కాంట్రాక్ట్ కార్మికుల వేతనం పెంచాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కోలిండియా మాదిరిగా రోజువారీ జీతం రూ.950 చెల్లించాలని ఏబీకేఎంఎస్ జాతీయ కార్యదర్శి పి.మాధవనాయక్ డిమాండ్ చేశారు. కొత్తగూడెంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి అభివృద్ధిలో కాంట్రాక్ట్ కార్మికుల శ్రమ దాగి ఉందన్నారు. ఈ మేరకు యాజమాన్యం కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇనుపనూరి నాగేశ్వరరావు, నిర్మల, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పోడు పట్టాల పంపిణీలో చేతివాటం

టేకులపల్లి: పోడు సాగు చేసుకుంటున్న ఆదివాసీ, గిరిజనులకు ఎట్టకేలకు పట్టాలు మంజూరయ్యాయి. ప్రస్తుతం గ్రామాల్లో పట్టాల పంపిణీ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. ఈ క్రమంలో దళారులు పుట్టుకొచ్చారు. అమాయక గిరిజనుల వద్ద రూ.500 నుంచి రూ.2,500 వరకు వసూలు చేస్తున్నారు. సర్వే సమయంలోనూ ఎకరానికి రూ.వెయ్యి నుంచి రూ.2వేల వరకు వసూలు చేశారు. ఇప్పుడు పట్టాలు వచ్చాక తమ కృషే కారణమని నమ్మించి మళ్లీ వసూళ్లకు దిగుతున్నారు. కొన్ని పంచాయతీల్లో ఉద్దేశ్య పూర్వకంగానే పట్టాల పంపిణీలో జాప్యం చేయిస్తున్నారు. డబ్బులు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. ఈ వసూళ్లలో కొందరి ఉద్యోగుల పాత్ర కూడా ఉన్నట్లు పలువురు చెబుతున్నారు. కొన్ని పంచాయతీల్లో ఇంటి పన్ను కడితేనే పట్టా ఇస్తున్నారని తెలిసింది.

నేడు 'సింగరేణి' ఎదుట నిరాహార దీక్ష

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 5న, కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట జరుప తలపెట్టిన ఒక్కరోజు నిరాహార దీక్షను జయప్రదం చేయాలని ఆ సంఘం అధ్యక్షులు రాసూరి శంకర్ తెలిపారు. మంగళవారం రుద్రంపూర్‌లోని అంబేద్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం నాయకులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్‌ల పరిశీలన

పాల్వంచరూరల్: మండల పరిధి నాగారం, రంగాపురం, సోములగూడెం గ్రామాల సమీపంలో కిన్నెరసాని వాగుపై నిర్మాణం చేసిన చెక్‌డ్యామ్‌లను మంగళవారం జలవనరులశాఖ ఈఈ బి.అర్జున్ పరిశీలించారు. రంగాపురం వద్ద చెక్‌డ్యామ్ సమీపంలో నవ భారత్ కంపెనీకి చెందిన తాగునీటి పైపులైన్ మరమ్మతులను పరిశీలించారు. చెక్‌డ్యామ్‌లలో పుష్కలంగా ఉందని రైతులకు సాగుకు నీటిని ఉపయోగపడుతుందన్నారు.

నత్తనడకన బ్రిడ్జి నిర్మాణం

- ఈ వానాకాలం కూడా రాకపోకలకు ఇక్కట్లే
- తొమ్మిదేళ్ల క్రితం నిధులు మంజూరు కాగా, రెండేళ్ల క్రితం పనులు ప్రారంభం


రాజాపురం, యానంబైల్ గ్రామాల మధ్య కిన్నెరసాని వాగుపై నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి

పాల్వంచరూరల్: వానాకాలం వచ్చిందంటే కిన్నెరసాని ప్రాజెక్టు గేట్లు ఎత్తినప్పుడల్లా ఎగువున ఉన్న 24 గిరిజన గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోతాయి. ఈ క్రమంలో తొమ్మిదేళ్ల క్రితం బ్రిడ్జి నిర్మాణం మంజూరైంది. అయినా ప్రారంభ మూహూర్తానికి ఐదేళ్లు పట్టింది. రెండేళ్లుగా బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. నిర్మాణ పనుల తీవ్ర జాప్యం కారణంగా ఈ వానాకాలంలో కిన్నెరసాని గెట్లు ఎత్తితే రాకపోకలకు నిలిచిపోతాయని గిరిజన ప్రజలు అందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని రాజాపురం, యానంబైల్ గ్రామాల మధ్య కిన్నెరసాని వాగుపై వర్షాకాలంలో కిన్నెరసాని ప్రాజెక్టు గేట్లు ఎత్తితే వరద ప్రవహించడంతో ఎగువున ఉన్న 24 గిరిజన గ్రామాల రాకపోకలు నిలిచిపోతాయి. దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో 2014లో రూ.8 కోట్ల నిధులు మంజూరయ్యాయి. సవాలక్ష కారణాలతో బ్రిడ్జి నిర్మాణ పనులు ఏళ్ల తరబడి ప్రారంభానికి నోచుకోక, చివరికి పనులు మొదలు పెట్టినా నత్తనడకన సాగుతున్నాయి. నెల రోజుల క్రితం స్థానిక ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు కూడా బ్రిడ్జి పనులు ఇంత ఆలస్యమా..? త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత అధికారులపై మండిపడ్డారు. అయినా పురోగతి లేదు. బ్రిడ్జి పనులు టెండర్ దక్కించుకున్న ఎమ్ఎస్ రెడ్డి కన్‌స్ట్రక్షన్స్ పనులను ప్రారంభించి పిల్లర్ల నిర్మాణం చేసి ఐదు పిల్లర్ల మధ్య స్లాబ్ వేశారు. ఇంకా ఆరు పిల్లర్ల మధ్య స్లాబ్ నిర్మాణం చేయాల్సి ఉంది. అప్రోచ్ రోడ్డు నిర్మాణం, హిరింగ్ కోట్, అప్రోచ్‌ల్యాబ్, సెంట్రల్ ఫిల్టర్ మీడియా డ్రాప్ వంటి పనులు చేయాల్సి ఉంది. అయితే నిర్మాణ కార్మికులకు వేతనాలు సక్రమంగా ఇవ్వకపోవడంతో పనులు వేగంగా జరగడం లేదు. దీంతో ఈ వర్షాకాలంలో పనులు పూర్తయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. దీంతో ఎగువున ఉన్న గిరిజన గ్రామాల ప్రజల రాకపోకలకు ఈ ఏడాది కూడా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. బ్రిడ్జి నిర్మాణం నిర్దేశించిన గడువులో పూర్తి అయితే చంద్రాలగూడెం, మల్లారం, రేగులగూడెం, ఉల్వనూరు, మందేరకలపాడు, సారెకల్లు, సత్యనారాయణపురం, యానంబైల్ గ్రామ పంచాయతీలోని గిరిజన గ్రామాల ప్రజలకు వర్షాకాలం కూడా రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బ్రిడ్జి పనులు త్వరగా పూర్తిచేయాలి



రూ.కోట్లు ఖర్చు చేసి కిన్నెరసాని వాగుపై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులు వేగంగా జరగడం లేదు. ఈ వర్షాకాలనికి పూర్తయ్యే పరిస్థితులు లేవు. వర్షాకాలంలో ఈ మార్గంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు స్పందించి త్వరగా పనులు పూర్తి చేయించాలి.

– ఎస్.నాగిరెడ్డి, ప్రభాత్‌నగర్

రాకపోకలు నిలిచిపోతున్నాయి



యానంబైల్, రాజాపురం మధ్య బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించగానే సంతోషపడ్డాం. కానీ పనులు ఏళ్ల తరబడి సాగుతుండడంతో ఈ వర్షాకాలం కూడా పూర్తయ్యే పరిస్థితి లేదు. కిన్నెరసాని ప్రాజెక్టు గేట్లు ఎత్తినప్పుడల్లా రాకపోకలు నిలిచిపోతున్నాయి. 24 గ్రామల ప్రజల అవస్థలు పడుతున్నారు.

– రవి, ఎంపీటీసీ, సత్యనారాయణపురం

కాంట్రాక్టర్‌పై ఒత్తిడి చేస్తున్నాం



కిన్నెరసాని వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు ఈ ఏడాది జూన్ నాటికి పూర్తి చేయాల్సి ఉంది. బ్రిడ్జి పొడవు 200 మీటర్లు, 11 పిల్లర్లు, 13 మీటర్ల ఎత్తులో నిర్మాణం జరిగింది. ఐదు పిల్లర్ల మధ్య స్లాబ్ పనులు పూర్తయ్యాయి. త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌పై ఒత్తిడి చేస్తున్నాం.

– వంశీ, ఆర్‌అండ్‌బీ ఏఈ

ఉర్దూ స్కూళ్లపై నిర్లక్ష్యం వీడాలి


మాట్లాడుతున్న యాకూబ్ పాషా

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని ఉర్దూ మీడియం స్కూళ్లపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా అన్నారు. మంగళవారం కొత్తగూడెంలోని సంఘం కార్యాలయంలో మాట్లాడారు. ఇల్లెందు, కొత్తగూడెం, పాత పాల్వంచలలో ఉర్దూ మీడియంలో మూడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు కొన్నేళ్లుగా నడుస్తున్నాయని, ఈ పాఠశాలలను నేటి వరకు ప్రాథమికోన్నత పాఠశాలలుగా అప్ గ్రేడ్ చేయకపోవడంతో విద్యార్థులు తెలుగు, ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో చేరుతున్నట్లు చెప్పారు. ఉర్దూ మీడియం పాఠశాలలో పుస్తకాలు ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉర్దూ మీడియం స్కూళ్లలో సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. హుస్సేన్ ఖాన్, షకీల్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత


టేకులపల్లి: సమ్మె నోటీసు అందజేస్తున్న జీపీ సంఘాల జేఏసీ నాయకులు

టేకులపల్లి: మండలంలోని 36 గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ సంఘాల జేఏసీ పిలుపులో భాగంగా మంగళవారం కార్యదర్శులకు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ కొత్తగూడెం జిల్లా నాయకుడు జర్పుల సుందర్ మాట్లాడుతూ... తెలంగాణలోని గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మనెంట్ చేయాలని, పంచాయతీ కార్మికులకు జీఓ నంబర్ 60 ప్రకారం మున్సిపల్ కార్మికుల వలె కేటగిరీల వారీగా వేతనాలు రూ.15,600, రూ.19,500, రూ.22,750 లకు పెంచాలని, మల్టీపర్పస్ వర్కర్స్ విధానం రద్దు చేయాలని, కారోబార్ బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శిగా నియమించాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాల డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు బి.మంగమ్మ, జె.లింగ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు రూ.26వేలు చెల్లించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే వరకు నిరవధిక సమ్మె కొనసాగుతుందని, ఈ సమ్మెకు గ్రామీణ ప్రాంతాల వారు సహకరించాలని గ్రామ పంచాయితీ వర్కర్స్ యూనియన్స్ జేఏసీ నాయకులు కోరారు. ఈనెల 6 నుంచి జరప తలపెట్టిన సమ్మె పోస్టర్లను స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ, ఇఫ్టూ, టీజీబీకేఎస్, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే 'పోడు' సమస్యకు పరిష్కారం


పాల్వంచరూరల్: మహిళా రైతుకు పోడు పట్టా అందజేస్తున్న కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా


ఇల్లెందురూరల్: పోలారంలో పట్టాలు పంపిణీ చేస్తున్న ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ


జూలూరుపాడు: పట్టాలు అందజేస్తున్న వైరా ఎమ్మెల్యే రాములునాయక్, ఎమ్మెల్సీ మధు

పాల్వంచరూరల్: గిరిజనేతరులకు కూడా పోడు పట్టాలు ఇప్పించేందుకు ప్రభుత్వం ద్వారా కృషి చేస్తానని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు హామీ ఇచ్చారు. మండలంలోని ఉల్వనూరులో మంగళవారం 4,193 ఎకరాలకు గాను 889 మంది గిరిజన రైతులకు పోడు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న గిరిజనుల కల సీఎం కేసీఆర్ కృషితో నెరవేరిందన్నారు. పోడుపట్టాలు పొందిన ప్రతీ రైతుకు రైతుబంధు, రైతు బీమా వర్తిస్తుందని చెప్పారు. పోడుపట్టాలు మంజూరు చేయడంపై డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు ఆధ్వర్యాన సీఎం కేసీఆర్ చిత్రపటానికి గిరిజన రైతులు క్షీరాభిషేకం చేశారు. జెడ్పీటీసీ బరపటి వాసుదేవరావు, ఎంపీపీ మడివి సరస్వతి, వైస్ ఎంపీపీ మార్గం గురవయ్య, సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేష్, తహసీల్దార్ రంగాప్రసాద్, ఎంపీడీఓ బి.అప్పారావు పాల్గొన్నారు.

జూలూరుపాడు: ఏళ్లుగా గిరిజనులు ఎదుర్కొంటున్న పోడు భూముల సమస్యను పరిష్కరించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ అన్నారు. మండలంలోని గుండెపుడిలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ఎమ్మెల్సీ తాతా మధుతో కలిసి గిరిజనులకు పోడు పట్టాలు పంపిణీ చేశారు. మండలంలోని 1,494 గిరిజన కుటుంబాలకు 3764.17 ఎకరాలకు పట్టాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత పాలకులు పోడు భూముల సమస్య పరిష్కరించకుండా మాయమాటలు చెబితే... కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు హక్కు కల్పించారని తెలిపారు. ఎమ్మెల్సీ మధు మాట్లాడుతూ.. పోడు రైతులకు పట్టాలు అందిన నేపథ్యాన రైతుబంధు కూడా అందుతుందని చెప్పారు. తొలుత సీఎం కేసీఆర్ చిత్రపటానికి గిరిజన ప్రజాప్రతినిధులు క్షీరాభిషేకం చేశారు. కాగా, పట్టాల కోసం గిరిజనులు మధ్యాహ్నం 12 గంటలకే చేరుకోగా, కార్యక్రమం 3గంటలకు ప్రారంభం కావడంతో ఎండవేడితో ఇబ్బంది పడ్డారు. ఎంపీడీఓ తాళ్లూరి రవి, తహసీల్దార్ శారద, ఎంపీపీ లావుడ్యా సోనీ, సీఐ శ్రీనివాస్, ఎస్సైలు పోటు గణేష్, ఎస్.కే.షాహీనా పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: సుదీర్ఘకాలంగా గిరిజనులు ఎదుర్కొంటున్న పోడు వివాదాలకు పట్టాల పంపిణీ ద్వారా సీఎం కేసీఆర్ శాశ్వత పరిష్కారం చూపారని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. మండలంలోని పలు గ్రామపంచాయతీలలో మంగళవారం ఎమ్మెల్యే స్వయంగా పోడు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ప్రతి గిరిజనుడికీ పోడు పట్టాలు పంపిణీ చేసేందుకు కసరత్తు చేయడం వల్ల కొంత జాప్యం జరిగిందని చెప్పారు. భవిష్యత్‌లో ఏ ఒక్కరూ అడవుల జోలికి వెళ్లకుండా కంకణబద్ధులు కావాలని కోరారు.

కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్, రైతుబంధు సమితి రాష్ట్ర సలహాదారు పులిగళ్ల మాధవరావు, జెడ్పీటీసీ వాంకుడోత్ ఉమాదేవి, వైస్ఎంపీపీ దాస్యం ప్రమోద్, డీసీసీబీ డైరెక్టర్ జనగం కోటేశ్వరరావు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు శీలం రమేష్, ఖమ్మంపాటి రేణుక, యలమద్ది రవి, తాండ్ర నాగరాజు, సదా, మల్సూర్, కవిత పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డి ఎంపికపై హర్షం

చుంచుపల్లి: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని భారతీయ జనతా పార్టీ తెలంగాణ అధ్యక్షుడిగా నియమించడం పట్ల పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రంగా కిరణ్ మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణ గడ్డపై కాషాయ జెండా ఎగరడం ఖాయమని పేర్కొన్నారు.

10న అప్రెంటీస్ మేళా

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 10న కొత్తగూడెం (రుద్రంపూర్)లోని ఐటీఐలో ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులకు అప్రెంటిష్‌షిప్ ట్రెనింగ్ కోసం ప్రధానమంత్రి జాతీయ అప్రెంటీస్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమ బయోడేటాను www.apprentiserhipinia.org.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొని ఆ కాపీని, ధ్రువీరణ పత్రాలతో మేళాకు హాజరు కావాలని సూచించారు.

వార్డెన్‌పై చర్యలు తీసుకోండి

పాల్వంచ: ఎస్సీ బాలికల వసతి గృహం వార్డెన్ సమయ పాలన పాటించడం లేదని చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.అజిత్ అన్నారు. మంగళవారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా చేస్తున్నారని, ఉన్నతాధికారులు తక్షణం వసతి గృహాన్ని సందర్శించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సుజన్, కల్యాణ్, రాజు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై నష్ట పరిహారం పొందొచ్చు

సుజాతనగర్: నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులు తగిన ఆధారాలతో నష్ట పరిహారం పొందవచ్చని పారా లీగల్ వలంటీర్ బి.రాజమణి అన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండలంలోని కోయగూడెంలో మంగళవారం రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పకుండా బిల్లులు తీసుకోవాలన్నారు. ఇనాం భూముల చట్టం, రైతుబంధు, ధరణి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రకళ, పంచాయతీ కార్యదర్శి నాగార్జున్ పాల్గొన్నారు.

ఉచిత ప్రమాద బీమా

ఇల్లెందు: సింగరేణి ఉద్యోగులకు ఉచిత ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు ఏరియా జీఎం జాన్‌ఆనంద్ తెలిపారు. మంగళవారం ఇల్లెందు జీఎం కార్యాలయంలో మాట్లాడుతూ.. ఉద్యోగుల సంక్షేమం కోసం ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్‌లతో అవగాహన ఒప్పందం జరిగిందన్నారు. రూ.40 నుంచి 50 లక్షల వరకు బీమా వర్తిస్తుందని తెలిపారు.

ఇంటింటికీ టీడీపీ

చుంచుపల్లి: తెలంగాణ రాష్ట్రంలో ఆర్థిక వనరులకు బీజం వేసింది తెలుగుదేశం పార్టీనే అని కొత్తగూడెం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ కనుకుంట్ల కుమార్ అన్నారు. మంగళవారం ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో భాగంగా చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీలో పార్టీ మండల అధ్యక్షుడు కోటయ్య ఆధ్వర్యంలో ప్రజలను కలిసి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. చుంచుపల్లి ఆనంద్, సర్వర్, తాజ్, రమేష్, నాగయ్య, రామారావు, సురేష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పిల్లలపై జాగ్రత్తలు పాటించాలి


రేగులగూడెంలో రికార్డులను పరిశీలిస్తున్న సీడీపీఓ కనకదుర్గ

పాల్వంచరూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో బోధన ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ఉండాలని ఐసీడీఎస్ పాల్వంచరూరల్ ప్రాజెక్టు సీడీపీఓ కనకదుర్గ అన్నారు. రేగులగూడెం, తుమ్మలగూడెం, బంజర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లోని గుడ్లు, పిల్లల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. టీచర్లతో మాట్లాడారు. ప్రీస్కూల్ పిల్లలకు సిలబస్ ప్రకారం అక్షరాలు, ఆటపాట, కథలు బోధించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సమయపాలన పాటించాలని, సమాచారం లేకుండా అంగన్‌వాడీ కేంద్రాలను వదిలి బయటకు వెళ్లకూడదన్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో న్యూట్రీగార్డెన్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పిల్లలను ఇంటికి పంపించేటప్పుడు, తీసుకొచ్చేటప్పుడు ఆయాలు జాగ్రత్తలు పాటించాలని, పిల్లలను కుటుంబ సభ్యులకు అప్పగించాలని సూచించారు.

పీఆర్‌సీ కమిషన్‌ను నియమించండి


మాట్లాడుతున్న రమేష్‌బాబు

టేకులపల్లి: పీఆర్‌సీ కమిషన్‌ను వెంటనే నియమించి ఐఆర్ ప్రకటించాలని టీఎస్‌టీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వాంకుడోత్ రమేష్ బాబు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో జరిగిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏహెచ్‌ఆర్‌ఏ జీఓ విడుదల చేయాలని, ఏజెన్సీ నుంచి ఏజెన్సీకి, మైదాన ప్రాంతం నుంచి మైదాన ప్రాంతానికి బదలీలు, పదోన్నతులు నిర్వహించాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, 2016 వేసవిసెలవుల్లో మధ్యాహ్న భోజన విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు ఈఎల్ఎస్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో హత్తీరాం, బన్సీలాల్, పూల్‌సింగ్, రామ్‌కిషన్, వెంకటరావు, సురేష్, సరస్వతి పాల్గొన్నారు.

గనిలో భద్రతపై అవగాహన


కార్మికులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధి పీవీకే–5 షాఫ్ట్ గనిలో మంగళవారం కార్మికులకు భద్రతపై అవగాహన కల్పించారు. 'నా భద్రత.. నా బాధ్యత' అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో రీజినల్ సేఫ్టీ జీఎం కుమారస్వామి, సేఫ్టీ డీజీఎం గోపాలరావు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఏటా జూన్‌లో సింగరేణిలో పరిధిలో ఎక్కడో ఓ చోట ప్రమాదం జరుగుతున్నా ఈ ఏడాది జరగలేదన్నారు. ఈ మేరకు కార్మికులు భద్రతను బాధ్యతగా భావిస్తూ విధులు నిర్వహించాలని సూచించారు. తద్వారా ఉత్పత్తి మెరుగుపడడమే కాక కుటుంబాలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. కార్మికులు గనిలోనే కాకుండా బయట కూడా ద్విచక్ర వాహనాలపై వెళ్తున్నప్పుడు తప్పక హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో కూసన వీరభద్రయ్య, చిలక రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

'అంబేద్కర్ చెమన్'ను కాపాడండి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా రామవరంలోని అంబేద్కర్ చెమన్‌ను అసాంఘిక కార్యకలాపాల నుంచి కాపాడాలని సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోషియేషన్ జనరల్ సెక్రటరీ ఆంతోటి నాగేశ్వరరావు, జిల్లా అంబేద్కర్ అసోసియేషన్ నాయకులు రిటైర్డ్ జీఎం అండెల ఆనందరావుకు మంగళవారం స్థానిక యువకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ.. ఈ గ్రౌండ్‌లో రాత్రి 7గంటల సమయంలో కొంతమంది వ్యక్తులు మద్యం సేవించి, బాటిళ్లను పగులగొట్టి నానా హంగామా చేస్తున్నారని ఆ సమయంలో వాకింగ్ వచ్చినవారు భయాందోళనకు గురవుతున్నారని చెప్పారు.

ఈ క్రమంలో వాకింగ్‌కు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి 7 గంటలకే గ్రౌండ్‌లో లైట్లు బంద్ చేస్తున్నారని, దీంతో ఆకతాయిలు గ్రౌండ్‌లోకి చేరుకుంటున్నారని, పోలీసులు పెట్రోలింగ్‌కు వచ్చినప్పుడు గ్రౌండ్‌ను పరిశీలించాలి కోరారు. స్పందించిన నాయకులు సింగరేణి, పోలీసు అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరించే విధంగా చూస్తామని చెప్పారు.

కొమరయ్య పోరాటం నేటి తరానికి స్ఫూర్తి


సింగరేణి(కొత్తగూడెం): కొమరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు


ఇల్లెందురూరల్: కొల్లాపురంలో నివాళులర్పిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): భూస్వామ్య దోపిడీ వ్యవస్థ, పెత్తందారీ ఏకస్వామ్య పోకడలకు వ్యతిరేకంగా దొడ్డి కొమరయ్య చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తి అని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా అన్నారు. మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో తెలంగాణ సాయుధ పోరాట తొలియోధుడు దొడ్డి కొమరయ్య 77వ వర్ధంతిని సీపీఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కొమరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వై.శ్రీనివాస్‌రెడ్డి, విజయలక్ష్మి, సాహిన్, సీహెచ్ నాగయ్య, బాజాజు రవి, రమేష్ పాల్గొన్నారు.

పాల్వంచ: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య వర్ధంతిని మంగళవారం అఖిల భారత యాదవ మహాసభ, కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు వల్లపు యాకయ్య ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ముక్కంటేశ్వరరావు, డాక్టర్ సోమరాజు దొర చేతులు మీదుగా రోగులకు పండ్లు, బ్రెడ్, పాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు నరిగే రమేశ్, కుక్కల సాంబయ్య, అల్లాడి పుల్లారావు, గంట సత్యం, మారుతి శ్రీనివాస్, ముడిగ శ్రీనివాస్, గొర్రె సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమరయ్య 77వ వర్ధంతిని కొల్లాపురం, కొమరారం గ్రామాలలో న్యూడెమోక్రసీ, ప్రజాపంథా ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ.. నిజాం రాజులకు ఎదురొడ్డి పోరాటం చేసి అమరత్వం పొందిన దొడ్డి కొమరయ్య తెలంగాణ ప్రజలకు ఉద్యమ స్ఫూర్తినింపారని గుర్తుచేశారు. ఆయన స్ఫూర్తితో స్వరాష్ట్రంలో ప్రజాహక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జె.సీతారామయ్య, మోకాళ్ల రమేష్, రాసుద్దీన్, నోముల భానుచందర్, ఆజ్మీర బిచ్చా, శంకర్, శాంతారావు తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

గురుకుల కళాశాలకు రక్షణేది?



పాల్వంచ మండలం కిన్నెరసానిలోని గిరిజన గురుకుల ప్రతిభా జూనియర్ కళాశాల ప్రహరీ గోడ కూలింది. పశువులు, కుక్కలు, పందులు కళాశాల ప్రాంగణంలో సంచరిస్తున్నాయి. అంతేకాకుండా కొంతమంది విద్యార్థులు తరుచు చెప్పాపెట్టకుండా బయటకు వెళ్తున్నారు. ప్రహరీ నిర్మించాలని, కళాశాలకు రక్షణ కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఐటీడీఏ ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– పాల్వంచరూరల్

ప్రశ్నించాల్సిన అధికారి : రవికుమార్, కళాశాల ప్రిన్సిపాల్
సెల్ నెంబర్: 9010183849